ఎస్‌సీఆర్‌పీఎస్ డైరీ ఆవిష్కరణ



సనత్‌నగర్: తెలంగాణ ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 డైరీని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆవిష్కరించారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో కమిటీ ప్రతినిధులతో కలిసి శనివారం నూతన సంవత్సర డైరీని ఆయన ఆవిష్కరించారు. ఎస్‌సీఆర్‌పీఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.సుదర్శన్‌బాబు, నగర ఉపాధ్యక్షులు కుర్మ మహేందర్, రాపాక అశోక్, శ్రీకాంత్, గోకెరా కవిత, కోడూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

బౌద్ధనగర్: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి జన్మదినం సందర్భంగా జామై ఉస్మానియాలోని రత్న ఓల్డేజ్ హోమ్ లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోమ్‌లోని అనాథ వృద్ధులకు, మహిళలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల కీర్తి, హర్షకిరణ్, రాజు సాగర్, భిక్షపతి, సురేష్, గణేష్, సాయి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

సనత్‌నగర్: డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో వాటిని సమకూరుస్తూ ముందుకుసాగుతున్నట్లు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. సనత్‌నగర్ ఎస్సార్టీకాలనీలోని భగత్ సింగ్ పార్కు ప్రాంతంలో రూ.5.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీవరేజీ పైప్‌లైన్ పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. జలమండలి డీజీఎం వంశీ, మేనేజర్ హిందుజా, నాయకులు కొలను బాల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్, పురుషోత్తం, ఫాజిల్ పాల్గొన్నారు.

'గాంధీ' రోగులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



సనత్‌నగర్: మోడల్‌కాలనీకి చెందిన మానవ సేవా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులను అందజేశారు. ఈ మేరకు రోగులకు పంపిణీ చేయాల్సిందిగా ఆస్పత్రి సివిల్ సర్జన్ అడ్మిన్, ఆర్‌ఎంఓ–1 డాక్టర్ బి.శేషాద్రికి 100 ప్లేట్లు, గ్లాసులను అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధి డి.బుచ్చిబాబు మాట్లాడుతూ రోగుల అవసరాలను తెలుసుకుని దాతల సహకారంతో వాటిని సమకూర్చేందుకు మానవ సేవా సమితి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు.

ప్రమాణాలు పాటించని కాలేజీలపై చర్యలు తీసుకోండి

ఉస్మానియా యూనివర్సిటీ: జేఎన్‌టీయూ పరిధిలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలలో ప్రమాణాలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని వీసీ ప్రొ.కిషన్‌కుమార్ రెడ్డికి శనివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ వినతిపత్రం సమర్పించారు. కాలేజీలు నిబంధనలను ఉల్లంఘిస్తు ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నాయని తెలిపారు. అధ్యాపకులు, ల్యాబుల కొరత, ఇతర మౌలిక వసతులు లేకున్నా ఇంజినీరింగ్ కాలేజీలను కొనసాగిస్తున్నట్లు వీసీకి వివరించినట్లు చెప్పారు.

అత్తింటి వేధింపులతో గృహిణి ఆత్మహత్య



శిరీషా (ఫైల్)

బౌద్ధనగర్: అత్తారింటి వేధింపులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. వారాసీగూడ ఇన్‌స్పెక్టర్ రాచకొండ సైదులు తెలిపిన మేరకు.. అల్వాల్‌కు చెందిన శివనాగలింగం కుమార్తె శిరీషా(28)భర్త పవన్‌కుమార్ అనారోగ్య కారణంగా 2020లోమరణించాడు. 2024లో బౌద్ధనగర్‌కు చెందిన యాకుబ్‌రెడ్డితో వివాహం జరిగింది. అప్పటికే యాఖుబ్‌రెడ్డి వివాహం కాగా మొదటి భార్యతో విడాకులు తీసుకున్నాడు. కొన్ని రోజులుగా వీరి సంసారం సాఫీగా సాగింది. మద్యానికి బానిసైన యాకుబ్‌రెడ్డి భార్య శిరీషాను వేధింపులకు గురి చేయడం ప్రారంభించాడు. భర్తతో పాటు అత్తమామలు సైతం వేధించారు. శుక్రవారం శిరీషా అల్వాల్‌లోని పుట్టింట్లో జరిగిన వేడుకకు హాజరై శనివారం ఉదయం 11 సమయంలో అత్తారింటికి వచ్చి మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. శిరీషా తల్లి ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం ఉత్కంఠ

పూర్తయిన సర్వే.. మిగిలింది వార్డు సభలే

- ఇందిరమ్మ ఇళ్ల సర్వే, సూపర్ చెక్ సర్వే లు పూర్తి
- జాబితా కోసం అర్హుల ఎదురుచూపులు



ర్యాండమ్‌గా సూపర్ చెక్ సర్వే చేస్తున్న బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య

సనత్‌నగర్: ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల సర్వే పూర్తి చేసుకుని, ఆ సర్వే సరిగ్గా జరిగిందా..లేదా అని మరోమారు ర్యాండమ్‌గా చేపట్టిన సూపర్ చెక్ సర్వే సైతం ముగిసింది. ఇక అర్హులు ఎవరు, అనర్హులు ఎవరు అనేది వార్డు సభల్లోనే తెలియాల్సి ఉంది. వాస్తవానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం గ్రామ సభలు చేపట్టి వాటి ద్వారా ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను ప్రకటించి, జాబితాలో పేర్లు లేని వారు మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినా గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రం వార్డు సభల నిర్వహణ జరగకపోవడంతో ఎంతమంది అర్హులు అనేది స్పష్టత రాలేదు. మిగతా చోట్ల దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి విచారణ చేపట్టి ఇప్పటికే లిస్ట్–1, లిస్ట్–2, లిస్ట్–3 పేరిట అర్హుల జాబితాను తయారుచేసినా గ్రేటర్‌లో ఇంకా అర్హులు ఎవరనేది వార్డు సభలు నిర్వహిస్తే తప్ప ఒక కొలిక్కి రాదనే విషయం స్పష్టమవుతుంది. ప్రభుత్వం వార్డు సభల నిర్వహణకు ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటోంది. వార్డు సభల్లో అర్హుల జాబితాను ప్రచురించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బేగంపేట సర్కిల్‌లో 25,698 ఇళ్ల పరిశీలన..

బేగంపేట సర్కిల్ పరిధిలోని బన్సీలాల్‌పేట, రాంగోపాల్‌పేట, బేగంపేట, మోండా డివిజన్ల వ్యాప్తంగా 25,698 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గత ఏడాది డిసెంబర్ నుంచి వీరందరి ఇళ్లకు వెళ్లి అధికారులు సర్వే చేశారు. అయితే కొందరు ఇళ్ల వద్ద అందుబాటులో లేకపోవడం, వేరే చోటకు షిఫ్టు కావడంతో అలాంటి వారి ఆచూకీని సైతం కనుగొనేందుకు పూర్తి స్థాయిలో ప్రయత్నాలు చేశారు. చివరకు దరఖాస్తుదారులందరి ఇళ్ల సర్వే పూర్తి చేయగా ఆ సర్వే సజావుగా జరిగిందా? లేదా అనేది పలువురిలో అనుమానం రేకెత్తింది. ఎందుకంటే చాలాచోట్ల సర్వే చేసేందుకు వచ్చిన అధికారులతో పాటు కొంతమంది నాయకులు వారి వెంట వచ్చి ఇందిరమ్మ ఇళ్లను ఇప్పిస్తామంటూ దరఖాస్తుదారులతో బేరసారాలు కూడా కుదుర్చుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో నేతల ఒత్తిడికి తలొగ్గి అనర్హులను సైతం అర్హులుగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారా? అన్న అనుమానాలకు తావిచ్చింది. ఈ నేపథ్యంలోనే మరోమారు ర్యాండమ్‌గా సూపర్‌చెక్ సర్వే కూడా చేపట్టారు. సర్కిల్ పరిధిలో 25,698 దరఖాస్తుదారుల ఇళ్ల పరిశీలన జరపగా, అందులో 1,064 మందిని ర్యాండమ్‌గా సూపర్ చెక్ సర్వే చేశారు. ఈ సర్వే బాధ్యతలను డీఎంసీ నుంచి ఏఈలు, డీఈలు, ఏఎంసీలు, పారిశుద్ధ్య, రెవెన్యూ విభాగంలోని కొందరు సీనియర్ అధికారులకు అప్పగించారు.

దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ..

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తవగా అర్హుల జాబితా ఎప్పుడు ప్రకటిస్తారోనని దరఖాస్తుదారుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ అర్హులుగా తేలితే మొదటి జాబితాలో పేరు ఉంటుందా? లేదా అన్న మీమాంస నెలకొంది. ఇదిలా ఉండగా ప్రభుత్వం ఒకవైపు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులకు స్థలం ఉండి ఇంటి నిర్మాణం చేపట్టేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించింది. అయితే చాలామంది తమకు ఇల్లు, స్థలం లేకపోయినా దరఖాస్తు చేసుకున్నారు. అయితే స్థలం ఉన్నవారికి ఆర్థిక సహాయం చేస్తుందా లేక ఇళ్లు నిర్మించి ఇస్తుందా? అన్న డైలామాలో ఉన్నారు. మొత్తానికి వార్డు సభలు ఎప్పుడు నిర్వహిస్తారోనని దరఖాస్తుదారులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

బేగంపేట సర్కిల్‌లో సర్వే వివరాలు
మున్సిపల్ డివిజన్లు- 4
ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులు: 25,698
సర్వే చేసిన ఇళ్లు: నూరు శాతం పూర్తి చేశారు
సూపర్‌చెక్ కింద సర్వే చేసిన ఇళ్లు: 1064

ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ప్రత్యేక వ్యవస్థ



సీఎం సహాయనిధి ఎల్‌ఓసీలను అందిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందగోరు నియోజకవర్గ వాసులు అవసరమైన సహాయం పొందడానికి సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సంప్రదించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ కోరారు. చిలకలగూడకు చెందిన బాలమణి, మంజుల శస్త్ర చికిత్సల కోసం రూ. 3.50 లక్షల సీఎం సహాయ నిధి ధృవపత్రాలను (ఎల్‌ఓసీ) వారి బంధువులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు దారులకు అన్ని రకాల సహాయాన్ని అందించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు సుంకు రాంచందర్, బాల్‌రాజ్‌గౌడ్, అశ్విన్‌కుమార్, రూపేశ్ తదితరులు పాల్గొన్నారు.

సందడి చేసిన విద్యార్థులు



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. విద్యార్థుల ఆటా పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ ఈఓ శ్రీధర్ హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూప, పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రతినిధులు శేషగిరిరావు, బి. నర్సింగ్ రావు, రాజు, హెచ్‌ఎం మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

సనత్‌నగర్: కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'జిజ్ఞాస' స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుల్లో బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి తెలిపారు. ఇంగ్లీష్, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బయో టెక్నాలజీ, కామర్స్, జువాలజీ, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మాథ్స్, హిందీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో విద్యార్థినుల ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. తొమ్మిది విభాగాల్లోనూ రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందేలా విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో పాటు ఆయా సబ్జెక్టుల సూపర్‌వైజర్లను కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషి



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఐజీ అరోమా సింగ్, డీఎస్‌సీ దెబస్మిత తదితరులు

అడ్డగుట్ట: మానవ అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు ఆర్పీఎఫ్, జీఆర్పీ, అసోసియేషన్ ఆఫ్ వాలంటరీ యాక్షన్(ఏవీఏ) సంయుక్తంగా కృషి చేస్తున్నాయని ఆర్పీఎఫ్ ఐజీ అరోమా సింగ్ ఠాకూర్, సీనియర్ డీఎస్‌సీ దెబస్మిత బెనర్జీలు అన్నారు. శనివారం సికింద్రాబాద్ సంచాలన్ భవన్‌లోని హవా మహల్‌లో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఐజీ అరోమా సింగ్ ఠాకూర్, డీఎస్‌సీ దెబస్మిత బెనర్జీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువు చెప్పిస్తాం, ఉద్యోగం చూపిస్తామనే మాయమాటలతో పిల్లలు, మహిళలను అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. 2023లో 305 మందిచిన్నారులను రెస్క్యూ చేసి 137 మంది ట్రాఫికర్లను అరెస్ట్ చేశామన్నారు. అదే విధంగా 2024లో 310 మంది బాధితులను రెస్క్యూ చేసి 174 మంది ట్రాఫికర్లను అరెస్ట్ చేసినట్లు వివరించారు. అనంతరం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ విధి విధానాలకు సంబంధించి బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏవీఏ స్టేట్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, హర్షిత, ఆర్పీఎఫ్, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఐడీహెచ్ కాలనీలో డబుల్ బెడ్రూం ఇళ్ల సీజ్



ఐడీహెచ్ కాలనీలో ఇండ్లను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ ఐడిహెచ్ కాలనీలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను శనివారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. సికింద్రాబాద్ డిప్యూటీ తహసీల్దార్ రజినీ సిబ్బందితో కలిసి వచ్చి ఇళ్ల సీజ్ చేశారు. వివాదంలో ఉన్న ఇళ్లను గతంలో రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అయితే కొందరు నిబంధనలకు విరుద్ధంగా సీజ్ చేసిన ఇళ్ల తాళాలను తొలగించారని బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు చిరంజీవి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు వచ్చి వాటిని సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి తాళాలు తొలగిస్తే చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మారియానో ఫీస్టా పేరుతో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అకడమిక్స్‌కు సంబంధించిన అంశాలపై పోటీలు నిర్వహించారు. సుమారు 10 కళాశాలల నుంచి వచ్చిన వందలాది మంది విద్యార్థులు వివిధ అంశాల్లో ప్రతిభ చూపారు. దీంతో కళాశాల ప్రాంగణం మొత్తం సందడి నెలకొంది. అనంతరం పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఆంథోనీ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలను అశ్రద్ధ చేయొద్దు



కంటి పరీక్షలు చేయించుకుంటున్న ట్రాఫిక్ ఏసీపీ

రాంగోపాల్‌పేట్: వాహనాలు నడిపే వారు కంటి సమస్యలను అశ్రద్ధ చేయవద్దని ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. శనివారం సికింద్రాబాద్‌లోని టాటా ఏఐ లైఫ్ ఇన్సూరెన్స్ సికింద్రాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలను గుర్తించి సరైన చికిత్సలు చేయించుకుంటే వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో విన్ విజన్ ఐ ఆస్పత్రి డాక్టర్ సురేంద్రనాథ్, సీసీవో నాగరాజు, డీవోఏ యాదగిరి పాల్గొన్నారు.

హోటల్ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తి రిమాండ్



పోలీసుల అదుపులో నిందితుడు సలీం

అడ్డగుట్ట: లాలాగూడలోని సూపర్ స్టార్ హోటల్ సిబ్బందిపై దాడి చేసి పరారైన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని శనివారం రిమాండుకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రఘు బాబు తెలిపిన మేరకు.. నార్త్‌లాలాగూడ ప్రాంతానికి చెందిన సలీం ఖాన్(44) గురువారం రాత్రి లాలాగూడలోని సూపర్ స్టార్ హోటల్‌కు వెళ్లి బిర్యానీ పార్శిల్ తీసుకున్నాడు. అనంతరం డబ్బులు చెల్లించకుండా వెళ్లిపోతుండగా హోటల్ సిబ్బంది అతన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇనుప రాడ్డుతో క్యాష్ కౌంటర్‌లో కూర్చున్న నిస్సార్‌పై దాడి చేసి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం రాత్రి సలీంను అదుపులోకి తీసుకుని మరుసటి రోజు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

గ్రేటర్‌పై కాషాయ జెండా ఎగురవేయాలి



బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్‌ను సన్మానించిన సనత్‌నగర్ నియోజకవర్గ నేతలు

సనత్‌నగర్: గ్రేటర్‌పై కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ సూచించారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన భరత్‌గౌడ్‌ను సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు శనివారం ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ బీజేపీ పటిష్టత కోసం శాయశక్తులా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు మహేష్, వై.శ్రీనివాసరావు, సుమన్‌కుమార్ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ విద్యార్థుల ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ రిజిస్ట్రార్ ఛాంబర్‌లో పీహెచ్‌డీ విద్యార్థులు ధర్నా చేపట్టారు. శనివారం 2018 ఆగస్టు నుంచి 2019 వరకు రెండు విడతలుగా పీహెచ్‌డీలో ప్రవేశం పొందిన విద్యార్థులు పరిశోధనను పూర్తి చేసేందుకు కాలపరిమితిని ఒక సంవత్సరం పాటు పొడిగించాలని డిమాండ్‌చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ నెల 28న జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు. కొమ్ము శేఖర్‌మాదిగ, జీడీ అనిల్‌కుమార్, జంగిలి దర్శన్, పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



రహమత్‌నగర్: ఎస్పీఆర్ హిల్స్‌లోనిఎస్‌వీఎస్ రెడ్ రోజ్ హైస్కూల్లో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. పాఠశాలల చైర్మన్ నీల రమేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు వైజ్ఞానిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పాఠశాల ప్రతినిధులు వాణిశ్రీ, పార్వతి, మంజుల పాల్గొన్నారు.

కులగణన సర్వే చరిత్రాత్మకమైనది

సనత్‌నగర్: ప్రజా ప్రభుత్వం చేసినటువంటి కులగణన సర్వే చారిత్రాత్మకమైనదని ఏఐసీసీ సభ్యురాలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో బీసీలకు దక్కిన గొప్ప గౌరవం కులగణన సర్వే అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా పారదర్శకంగా బీసీ కులగణన సర్వే చేశారన్నారు.

మీ సేవా కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

అడ్డగుట్ట: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మీ సేవా నిర్వాహకులు ప్రయత్నించాలని మారేడుపల్లి మండల తహసీల్దార్ భీమయ్య గౌడ్ సూచించారు. మారేడుపల్లిలోని ప్రభుత్వ మీసేవా కేంద్రాన్ని తహసీల్దార్ భీమయ్య గౌడ్ శనివారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులకు మెరుగైన సేవలు అందించే విధంగా నిర్వాహకులు ప్రయత్నించాలన్నారు.

మానవతా దృక్పథంతో వ్యవహరించాలి



లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు పవన్‌కుమార్ గౌడ్‌కు వినతి పత్రం అందజేసిన చిరు వ్యాపారులు

పద్మారావునగర్: చిరు వ్యాపారుల పట్ల అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు జి. పవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఫుట్‌పాత్ వ్యాపార కార్యకలాపాలను అధికారులు తొలగించారు. దీంతో చిరు వ్యాపారులు స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు జి. పవన్‌కుమార్ గౌడ్ శనివారం ఈ ప్రాంతాన్ని సందర్శించి చిరు వ్యాపారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా జి. పవన్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పొట్టకూటి కోసం చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకునే వారి పట్ల పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు కొంత సడలింపు ఇవ్వాలన్నారు కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్.ఐ కరుణాకర్, బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట్ అధ్యక్షులు వెంకటేషన్‌రాజు పాల్గొన్నారు.

అలరించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన



విద్యార్థులు రూపొందించిన తెలంగాణ సచివాలయం నమూనా

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో అమరావతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో శనివారం జ్ఞానోదయ–2025 పేరుతో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన సందర్శకులను అలరించింది. ప్రదర్శనను ముషీరాబాద్ డిప్యూటీ విద్యాశాఖ అధికారి స్వరూపారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని సృజనాత్మకశక్తిని పెంపొందించేందుకు విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించే పాఠశాలలకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. విద్యార్థులు రూపొందించిన అమోధ్య బాలరామాలయం, సచివాలయం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ సమస్యలు అంశాల పట్ల రూపొందించిన ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అమరావతి విద్యా సంస్థల నిర్వాహకులు ప్రశాత్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కుల దురహంకార హత్యలు అమానుషం



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న దళిత బహుజన ఫ్రంట్ నాయకులు

అడ్డగుట్ట: ప్రజా స్వామ్యంలో నేటికీ కుల దురహంకార హత్యలు జరగడం అమానుషమని పలువురు సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం అడ్డగుట్టలోని అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో కులదురహంకార హత్యలపై మౌనం వీడుదాం, భారత రాజ్యాంగ లక్ష్యాలైన స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావాన్ని పెంపొందించాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సూర్యాపేటలో కులాంతర వివాహం చేసుకున్న దళిత యువకుడైన బంటిని హత్య చేయడం దారుణమన్నారు. సమావేశంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, హైకోర్టు న్యాయవాది ఎద్దు దివాకర్ పాల్గొన్నారు.

సమాజ్‌వాది పార్టీ అభ్యర్థులకు మద్దతివ్వండి



మాట్లాడుతున్న ప్రొ.సింహాద్రి

లాలాపేట: రాష్ట్ర అభివృద్ధి వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమాజ్‌వాది పార్టీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలనీ ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ ఎస్. సింహాద్రి అన్నారు. శనివారం తార్నాకలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గం అభ్యర్థిగా డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లు, నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ నియోజక వర్గం అభ్యర్థిగా ప్రొఫెసర్ తాటికొండ వెంకటరాజయ్య తదితరులు సమాజ్‌వాది పార్టీ తరపున పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యావంతులైన వారు విజ్ఞతతో ఓటు వేయాలనీ సూచించారు.

పోలీసులకు వైద్యపరీక్షలు

రసూల్‌పురా: సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారి ఆరోగ్య పరిరక్షణలో బాగంగా ఆస్టర్ ప్రైమ్ హస్పిటల్ సహకారంతో కార్ఖాన పోలీస్‌స్టేషన్‌లో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు . ఈ శిబిరంలో ఇన్‌స్పెక్టర్ రామకృష్ణతో పాటు ఎస్‌ఐలు, సిబ్బందికి వైద్య వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యులు సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు.



కార్ఖాన పీఎస్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న నృత్యం



రసూల్‌పురా: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ప్రతి శని, ఆదివారాల్లో కళా సంధ్యా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్రపతి నిలయం పరిపాలనాధికారి రజని ప్రియా తెలిపారు. శనివారం కళాసంధ్య కార్యక్రమంలో భాగంగా నృత్యకార్యక్రమాలు నిర్వహించారు. నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది.